నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శనివారం 26 అక్టోబర్ 2024 | KHAMMAM

మణుగూరు పోలీసుల ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ

మణుగూరు టౌన్, అక్టోబర్ 25: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో పోలీసులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని మణుగూరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో మణుగూరు, అశ్వాపురం, ఏడూళ్ల బయ్యారం సీఐలు సతీశ్‌కుమార్, అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎస్సైలు మేడా ప్రసాద్, రాజ్‌కుమార్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

రైతు నెత్తిన హస్తం

- అన్నదాతల నడ్డి విరిచిన కాంగ్రెస్ సర్కార్
- అరకొరగా రుణమాఫీ.. 'రైతు భరోసా'కు ఎగనామం
- పత్తి తీత ప్రారంభమైనా కానరాని సీసీఐ కేంద్రాలు
- మరోవైపు ఈ ఏడాది కర్షకులకు కలిసిరాని కాలం
- ఘోస పడుతున్న రైతన్నలు.. పట్టించుకోని ప్రభుత్వం
- ఆర్థిక భారంతో ముందుకు 'సాగు'తున్న వైనం

అన్నం పెట్టే రైతన్నలకు అండగా నిలవాల్సిందిపోయి వారినెత్తినే ప్రభుత్వం 'హస్తం' పెడుతున్నది ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం. గడిచిన పదేళ్లలో గత కేసీఆర్ ప్రభుత్వం అన్నదాతలకు వెన్నుదన్నుగా నిలువగా.. ఇప్పటి ఈ కాంగ్రెస్ సర్కారు మాత్రం ఈ ఏడాది రైతన్నలను నిండా ముంచింది. ఎన్నికల హామీలను తుంగలో తొక్కి కర్షకుల ఉసురుతీస్తున్నది. గొప్పగా చెప్పుకున్న రుణమాఫీ సైతం కొద్దిమందికే చేసి చేతులు దులుపుకుంది. రైతుబంధు స్థానంలో తెచ్చిన 'రైతు భరోసా'తో ఎకరానికి రూ.15 వేలు పంటల పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పి.. ఈ వానకాలంలో మొత్తానికే ఎగనామం పెట్టింది. మరోవైపు పత్తి పంట జోరుగా మార్కెట్‌కు వస్తున్నప్పటికీ సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. అసలే ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు తెగుళ్ల తో పంటల దిగుబడి రాక సతమతమవుతున్న అన్నదాతలకు ఏమాత్రం సాయం అందించకుండా వారి నడ్డి విరుస్తున్న చరిత్ర కాంగ్రెస్ సర్కారుకే చెందుతుందనడంలో సందేహం లేదు.

–భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ)

వరి పంటకు తెగులు సోకింది..

పంట పండించడం ఒక ఎత్తయితే.. రుణమాఫీ కోసం బ్యాంకుల చుట్టూ తిరగడం మరో ఎత్తయింది. ఇక చేతిలో పెట్టుబడి లేకుండా ఎలా సాగు చేయాలో అర్థం కాని పరిస్థితి. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతుబంధు రంఛనుగా వచ్చేది. ఈ ప్రభుత్వంలో రైతు భరోసా కూడా రాలేదు. చేతిలో సమయానికి పెట్టుబడి లేకపోవడంతో మా వరి పంటకు తెగులు సోకింది.

–కె.వీరభద్రకుమార్, రైతు, చిననల్లబెల్లి, దుమ్ముగూడెం

రుణమాఫీ కాలేదు.. పంటలు బాగా లేవు..

రుణమాఫీ కోసం బ్యాంకులు చుట్టూ తిరిగాను. ధర్నాలు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులను పట్టించుకున్నవారే లేరు. ఎక్కడైనా మూడుసార్లు ధర్నా చేసిన రైతులు ఉన్నారా అంటే.. అది చంద్రుగొండలోనే. మేం రుణమాఫీ కోసం తిరుగుతుంటే పంటలు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం ఏ మాత్రం ఆదుకోవడం లేదు.

–గుగులోత్ రమేశ్, రైతు, తిప్పనపల్లి, చంద్రుగొండ మండలం



దుమ్ముగూడెంలో ఎండిపోయిన వరి పంట

అరకొర 'రుణమాఫీ'..

చంద్రుగొండ మండలం గానుగపాడు సొసైటీ పరిధిలో మొత్తం 2,850 మంది రైతులు పంట రుణాలు తీసుకున్నారు. కానీ, వీరిలో 850 మందికి మాత్రమే రుణమాఫీ అయింది. రైతులు ఇప్పటికే మూడుసార్లు రోడ్కెక్కి నిరసన వ్యక్తం చేసినా వారికి న్యాయం జరగలేదు.

చంద్రుగొండలో రుణమాఫీ కోసం ధర్నా చేస్తున్న రైతులు (ఫైల్)

4,77,538 ఎకరాల్లో పంటలు..

భద్రాద్రి జిల్లావ్యాప్తంగా 4,77,538 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇప్పటికే వర్షాల ఆలస్యం కారణంగా పంటల సాగు లేటుగా ప్రారంభమైంది. తరువాత కురిసిన భారీ వర్షాలకు చెరువులకు గండ్లు పడ్డాయి. దీంతో అప్పటికే చేతికొస్తున్న పంటలన్నీ కొట్టుకుపోయాయి. మరోవైపు ఇదే వర్షాలకు పత్తి పంట కొన్ని చోట్ల పూత, కాత లేని దశలో ఉంది. మరికొన్ని చోట్ల చేతికొచ్చినా సీసీఐ కేంద్రాలు పెట్టింది లేదు. కర్షకుల పత్తిని కొనుగోలు చేసింది లేదు. ఇక మిర్చి పంటలు నీటమునగడంతో ఆ రైతులకు భారీగానే నష్టం వాటిల్లింది. జిల్లాలో 1,61,731 ఎకరాల్లో వరి, 1,98,268 ఎకరాల్లో పత్తి, 81,242 ఎకరాల్లో జొన్న పంటలను రైతులు సాగుచేశారు. ఇతర పంటలతో కలుపుకొని మొత్తంగా 4,77,538 ఎకరాల్లో పంటలు సాగైనా ప్రభుత్వం నుంచి భరోసాలు, గిట్టుబాటు ధరలు లేకుండా పోయాయి.

గడిచిన పదేళ్లపాటు సాగును సంబురంగా చేసుకున్న అన్నదాతలను ప్రస్తుత ప్రభుత్వం అన్ని విధాలా ఆవేదనకు గురిచేస్తోంది. మూడు దఫాల్లో రుణమాఫీ చేశామంటూ గప్పాలు చెప్పినా తీరా చూస్తే అంతా అరకొరే. ఇక రైతుభరోసాదీ, పంటల పరిహారానిదీ అదే తీరు. దీంతో భద్రాద్రి జిల్లావ్యాప్తంగా అన్నదాతలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బ్యాంకుల వద్ద ధర్నాలు చేసినా, కలెక్టరేట్‌ను ముట్టడించినా వారికి ఫలితం దక్కలేదు. దీంతో గడిచిన పదేళ్లలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు సాయాన్ని ఎంత రంఛనుగా అందించిందో అన్నదాతలు గుర్తు చేసుకుంటున్నారు. వంచించిన కాంగ్రెస్‌పై దుమ్మెత్తి పోస్తున్నారు.

పత్తి పంట దళారులపాలు..

పంట చేతికొచ్చేసరికి దళారులు రంగప్రవేశం చేశారు. కాపు కాసి మరీ ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. అయినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నది. ఏటా 5 నుంచి 6 లక్షల మెట్రిక్ టన్నుల పత్తిని మాత్రమే సీసీఐ కొనుగోలు చేస్తున్నది. దీంతో దళారులు రాజ్యమేలుతున్నారు. ఏకంగా రైతుల ఇంటికెళ్లి మరీ వారి పత్తిని కొంటున్నారు. తక్కువ ధర చెల్లిస్తూ వారిని నిండా ముంచుతున్నారు. ఈ ఏడాది 2,01,216 ఎకరాల్లో పత్తి పంటను రైతులు సాగు చేయగా.. 16 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అయితే సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఇంతవరకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తాతా మధు, చిత్రంలో సండ్ర, కమల్‌రాజు

అక్రమ కేసులు, అరెస్టులకు..

భయపడం

- కేసులు, జైళ్లు.. బీఆర్ఎస్ నాయకులకు కొత్తకాదు
- అధికారులూ.. మంత్రులకు తొత్తులుగా మారొద్దు
- పెంట్యాల పుల్లయ్యపై కేసును ఉపసంహరించుకోవాలి
- ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు
- తప్పుడు కేసులతో రాక్షస ఆనందమా?: సండ్ర, లింగాల

ఖమ్మం, అక్టోబర్ 25: బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు.. కేసులు, జైళ్లు కొత్తేమీకాదని, వీటికి పార్టీ శ్రేణులేమీ భయపడబోవని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు స్పష్టం చేశారు. తప్పుడు కేసులు పెడితే భవిష్యత్‌లో తగిన మూల్యం చెల్లించక తప్పదని తేల్చిచెప్పారు. ఖమ్మంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయమైన తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారం ఉంది కదా అని కాంగ్రెస్ నాయకులు వారి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే భవిష్యత్‌లో వడ్డీతో సహా చెల్లిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతుండడంతో క్రియాశీలకంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను అయ్యప్పస్వామి మాలలో ఉండగా అత్యవసరంగా ఎందుకు అరెస్టు చేయాల్సి వచ్చిందో మధిర నియోజకవర్గ ప్రజలకు తెలుసునని అన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, పోలీస్ ఉన్నతాధికారులు హుందాతనంతో పనిచేయాలని, ఎవరి మెప్పు కోసమో పనిచేస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవని అన్నారు. 'ప్రజల పక్షాన పోరాడే స్వేచ్ఛ ప్రతిపక్షానికి లేదా?' అని ప్రశ్నించారు. సాక్షాత్తూ డిప్యూటీ సీఎం ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు తన భూమిని కబ్జా చేసినందునే ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడని, ఆ రైతు కుటుంబానికి నేటికీ న్యాయం జరగలేదని అన్నారు. విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో రైతును పొట్టనపెట్టుకున్న ఘటనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాలతో అన్నివర్గాల ప్రజలు సతమతమవుతున్నారని, అధికారం చేపట్టిన అతి తక్కువ సమయంలోనే ప్రజలు కాంగ్రెస్‌ను చీదరించుకుంటున్నారని అన్నారు. మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావులు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ శ్రేణులపై తప్పుడు కేసులు బనాయించి రాక్షసానందం పొందుతున్న కాంగ్రెస్ పార్టీ నేతల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని అన్నారు. నాడు తెలంగాణ పోలీసులకు ఫ్రెండ్లీ పోలీస్‌గా ప్రత్యేక గుర్తింపు వచ్చే విధంగా కేసీఆర్ పాలన అందించారని, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం పోలీసులను తప్పుడు కేసులకు ప్రోత్సహిస్తూ కొత్త సంస్కృతికి తెరలేపుతున్నారని అన్నారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే.. ప్రస్తుతం ఏపీలో ఉన్నతాధికారులకు పట్టిన గతి పడుతుందని స్పష్టం చేశారు

పుల్లయ్యతో జైలులో ములాఖత్

ఖమ్మం జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యను తాతా మధు, సండ్ర వెంకటవీరయ్య, లింగాల కమల్‌రాజు పరామర్శించారు. పార్టీ నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ మధిర నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేది లేదు: వద్దిరాజు

ఖమ్మం, అక్టోబర్ 25: కాంగ్రెస్ బెదిరింపులకు భయపడేది లేదని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్యపై అక్రమంగా కేసు పెట్టడం, అరెస్టు చేయడం ద్వారా అధికార పార్టీ నేతలు బెదిరింపులకు పాల్పడుతున్నారని అన్నారు. పుల్లయ్య అరెస్టును తట్టుకోలేక ఆయన భార్య గుండెనొప్పితో కుప్పకూలినా.. అధికార పార్టీ నేతలు మానవతా విలువలను మరిచారని విమర్శించారు. ప్రజల మద్దతుతో ఇలాంటి చర్యలకు గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు.

ఈ అరెస్టు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం: నామా

ఖమ్మం, అక్టోబర్ 25: బీఆర్ఎస్ చింతకాని మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య అరెస్టు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులను తప్పుడు కేసులతో వేధించడం సరికాదని అన్నారు. రాజకీయాల్లో అధికారం శాశ్వతం కాదని, ప్రజల హక్కుల కోసం పోరాడే వారిని అరెస్ట్ చేయడం తగదని అన్నారు. పుల్లయ్యపై పెట్టిన తప్పుడు కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు

అభివృద్ధి ఫలాలు అందరికీ అందాలి

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్‌లో జరిగిన ముఖాముఖిలో మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

- రెండు జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమం తీరు బాగుంది
- అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- ఉమ్మడి జిల్లా పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఐడీవోసీల్లో రచయితలు, ప్రముఖులతో ముఖాముఖి

భద్రాద్రి కొత్తగూడెం, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలని, ప్రభుత్వాలు చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలో శుక్రవారం పర్యటించిన ఆయన.. ఆయా అధికారిక కార్యక్రమాలకు హాజరయ్యారు. తొలుత భద్రాద్రి ఐడీవోసీలో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, ఐటీడీఏ పీవో రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజ్‌లు స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ప్రాముఖ్యత, సంస్కృతీ సంప్రదాయాలు, వివిధ శాఖల ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి కలెక్టర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు బాగున్నదని ప్రశంసించారు. ముఖ్యంగా 2021లో 73గా ఉన్న రక్తహీనత శాతాన్ని 2024 నాటికి 21 శాతానికి తీసుకురావడం అభినందనీయమన్నారు. అనంతరం ఐడీవోసీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. జిల్లా యంత్రాంగం తరపున గవర్నర్‌ను కవులు, రచయితలు శాలువా కప్పి జ్ఞాపికలతో సన్మానించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, డీఎఫ్‌వో కిష్టాగౌడ్, ఆర్డీవోలు మధు, దామోదర్ పాల్గొన్నారు.

రామయ్య సేవలో రాష్ట్ర గవర్నర్

భద్రాచలం, అక్టోబర్ 25: భద్రాచలం సీతారామచంద్రస్వామిని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ శుక్రవారం దర్శించుకున్నారు. గవర్నర్‌కు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. గర్భగుడిలోని ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ధ్వజస్తంభం వద్ద పూజలు చేసిన తర్వాత గవర్నర్‌కు అర్చకులు పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఉప ఆలయాల్లోనూ పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ విశిష్టతను వివరించారు. మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ జితేశ్ వి పాటిల్, పీవో రాహుల్, ఎస్పీ రోహిత్‌రాజు, ఆలయ ఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల మూసివేత.. మీడియాకు నో ఎంట్రీ..

కాగా, గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు ఉదయం రామాలయ మాడవీధులు, ఆలయ పరిసరాల్లోని దుకాణాలను ముందస్తుగా మూసివేయించారు. దీంతో వ్యాపారులతోపాటు పూజ సామగ్రి కొనుగోలు చేసేందుకు భక్తులు ఇబ్బందిపడ్డారు. ఆలయంలోని భక్తులు కూడా సుమారు రెండు గంటలపాటు నీరీక్షించారు. అయితే, గవర్నర్ పర్యటనకు మీడియాను అనుమతించని పోలీసులు.. కాంగ్రెస్, బీజేపీ నేతలను మాత్రం అనుమతించారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ఖమ్మం పర్యటనలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

ఖమ్మం కలెక్టరేట్‌లో స్టాల్‌ను పరిశీలిస్తున్న గవర్నర్ వర్మ

ఖమ్మం, అక్టోబర్ 25: 'ధర్మో రక్షతి రక్షితః' అనే నినాదం ప్రకారం పర్యావరణాన్ని పరిరక్షించడం మనందరి బాధ్యత అని, ఇందుకోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. ఖమ్మంలో శుక్రవారం పర్యటించిన ఆయన.. ఎంపీ రఘురాంరెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్ శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్‌లతో కలిసి జిల్లా అధికారులు, ప్రముఖులు, కళాకారులు, రచయితలు, క్రీడాకారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన ముఖాముఖికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య మాదిరిగా తాను కూడా పర్యావరణ వేత్తగా తన కెరీర్‌ను ప్రారంభించానని గుర్తుచేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రిషన్ గార్డెన్ ఏర్పాటు చేయడం చాలా బాగున్నదని అన్నారు. భద్రాద్రి జిల్లాలోని పాఠశాలల్లో ఔషధ మొక్కలు పెంచుతున్నందున ఖమ్మం జిల్లాలోనూ ఇది అమలు చేయాలని గవర్నర్ సూచించారు. ఖమ్మం జిల్లా పర్యాటకంగా అభివృద్ధి చెందేందుకు ఎంతో అవకాశం ఉందన్నారు. బౌద్ధస్తూపం మరింత అభివృద్ధి కావాలని, అనేకమంది పర్యాటకులు జిల్లాకు రావాలని గవర్నర్ ఆకాంక్షించారు. జిల్లాలో మరోసారి పర్యటించినప్పుడు ప్రముఖులతో పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తానని అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్, జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీఆర్డీవో సన్యాసయ్య, డీఈవో సోమశేఖర శర్మ, సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

డిజి'డల్' సర్వే!

- సమస్యలతోనే సర్వే చేస్తున్న వ్యవసాయ విస్తరణ అధికారులు
- నెట్‌వర్క్ సరిగాలేక, విలేజ్ డేటా ఓపెన్ కాక అవస్థలు
- వాగులు, వంకలు దాటుతూ మహిళా ఏఈవోల ఇబ్బందులు

ఒంటరిగానే వెళ్లి సర్వే చేస్తున్న మహిళా ఏఈవో

ఖమ్మం వ్యవసాయం, అక్టోబర్ 25: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్) వ్యవహారంలో వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈవో) నానా అవస్థలు పడుతున్నారు. మరీ ముఖ్యంగా మహిళా ఏఈవోల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. సర్వే చేయడానికి ఒక సహాయకుడిని ఇవ్వాలని ఏఈవోలు డిమాండ్ చేయడం.. ప్రభుత్వం ససేమిరా అనడం.. ఈ క్రమంలోనే మూకుమ్మడి సెలవులు పెట్టడం.. పలుచోట్ల పలువురు ఏఈవోలను సస్పెండ్ చేయడం.. మళ్లీ విధుల్లోకి తీసుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో గత బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్‌తో ఏఈవోలు చర్చలు జరిపిన సంగతి తెలిసిందే. దీంతో కుదిరిన ఒప్పందం మేరకు మూడు రోజుల సర్వే అనంతరం సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడంతో గురువారం నుంచి జిల్లావ్యాప్తంగా డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను ప్రారంభించారు. సర్వేలో పాల్గొంటున్న ఏఈవోలు ముందు ఊహించినట్లుగానే పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు.

సాంకేతిక సమస్యలతో సతమతం

ప్రధానంగా ప్రత్యేక యాప్‌లో సర్వే వివరాలను క్షేత్రస్థాయిలోనే నమోదు చేయాల్సి ఉండడంతో పలు సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. సర్వే ప్రదేశంలో నెట్‌వర్క్ సరిగా లేకపోవడంతో గంటల తరబడి అక్కడే వేచి చూడాల్సి వస్తున్నదని, యాప్‌లో కనీసం విలేజ్ డేటా సైతం ఓపెన్ కావడం లేదని వారు వాపోతున్నారు. సర్వే నెంబర్ ఒక రైతు పేరున ఉంటే.. మరో రైతు వివరాలు ప్రత్యక్షం కావడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. అంతేకాక సర్వే నెంబర్‌తోపాటు బై నెంబర్లకు వెళ్లాల్సి రావడంతో కిలోమీటర్ల మేర నడక సాగించాల్సి వస్తున్నది. వాగులు, వంకలు, చిట్టడవుల ప్రదేశంలో కనీసం దారి సైతం లేకపోవడంతో ఇదేం సర్వేరా బాబూ.. అంటూ తలలు పట్టుకుంటున్నారు. ముఖ్యంగా మహిళా ఏఈవోల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. 129 మంది ఏఈవోలలో కొందరు సెలవులో ఉండగా.. ప్రధాన సర్వే నెంబర్లతోపాటు ప్రతి బై నెంబర్‌లోని భూమిలో పంట వివరాలు నమోదు చేయాల్సి ఉండడంతో సర్వే ఈ సీజన్ మొత్తానికి పూర్తవుతుందా అనే అనుమానం కలుగుతున్నది. ప్రతి ఏఈవోకు ఓ సహాయకుడిని నియమించాలనే షరతు ఏఈవోలు విధించడంతో సోమవారం మరోమారు జరిగే చర్చలతో సర్కార్ ఏ నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

రైతును అడిగి వివరాలు నమోదు చేస్తున్న ఏఈవో

ఖమ్మం కమిషనరేట్‌లో ఫోరెన్సిక్ ల్యాబ్

ఖమ్మం, అక్టోబర్ 25: ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ ఖమ్మం పోలీసు కమిషనరేట్‌లో అందుబాటులోకి వచ్చిందని పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేర న్యాయ వ్యవస్థ నిర్వహణలో విశ్వసనీయమైన శాస్త్రీయ సేవలను అందిస్తూ.. శాస్త్రీయ పరిశోధన రంగంలో స్థిరమైన పురోగతిని సాధిస్తున్న ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీని ఖమ్మం జిల్లాతోపాటు భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట జిల్లాలకు అందుబాటులో ఉండేవిధంగా ఖమ్మంలోని జూబ్లీపుర ఎస్బీఐ ఎదురుగా ఉన్న ప్రభుత్వ భవనంలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇకపై ఈ నాలుగు జిల్లాలకు సంబంధించిన ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. హత్యలు, లైంగికదాడులు, దోపిడీల కేసుల్లో అనుమానాస్పద పరిస్థితుల్లో మరణం సంభవించిన మరణ కారణాలను తెలుసుకోవడం నేర దర్యాప్తులో అతి ముఖ్యమైన అంశమని అన్నారు. ఇలాంటి కేసుల్లో వైద్యాధికారి శవాన్ని పరీక్షించి కడుపులోని భాగాలు రక్తం, మెదడు, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు తదితర శరీర భాగాలను తీసి గతంలో వరంగల్ జిల్లా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపి వాటిని పరీక్షించేవాళ్లమని అన్నారు. ఇప్పుడు ఖమ్మం ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ విభాగంలో పనిచేసే నిపుణులు శాస్త్రీయ విజ్ఞానంతో పరీక్షిస్తారని తెలిపారు. దీనిని నాలుగు జిల్లాల పోలీస్ అధికారులు ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.